పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- సీఐటీయూ ఏరియా, మండల కన్వీనర్లు పెంటయ్య, కృష్ణ
- పలు చోట్ల రిలే నిరాహార దీక్ష

కడ్తాల్ : ఎమ్మార్సీ భవనం ఎదుట సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పెంటయ్య

కడ్తాల్, జూలై 15 : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా జీతాలు అందక, భోజనం బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు, మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకిచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మమ్మ, గ్రామ అధ్యక్షురాలు వరలక్ష్మి, సభ్యులు బుజ్జమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. మంచాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు సీఐటీయూ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు తొమ్మిది నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, జంగమ్మ, అలివేలు, యాదమ్మ పాల్గొన్నారు.

మంచాలలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు


కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

లక్ష్యం దిశగా పయనించాలి : ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్, జూలై 15 : విద్యార్థులు విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఎన్ని అడ్డంకులు వచ్చినా లక్ష్యం దిశగా పయనించాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాలయంలో సదుపాయాలు, భోజన వసతి తదితర అంశాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోనే భవిష్యత్ బంగారంగా ఉంటుందని, ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకోవాలన్నారు. జ్ఞానం తరగని సంపద అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మనం ఉన్నత చదువులు చదువుకుంటేనే మన భవిష్యత్‌తో పాటు మన దేశ భవిష్యత్ బాగుంటుందన్నారు. 500 మంది విద్యార్థినులకు సరిపడా డైనింగ్ హాల్ లేదని విద్యార్థినులు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎంఈవో శంకర్‌రాథోడ్ పాల్గొన్నారు.

మెదడు వాపుపై అవగాహన

చేవెళ్లటౌన్, జూలై 15 : 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ మెదడువాపు వ్యాధి వ్యాక్సిన్ తప్పని సరిగా ఇవ్వాలని ఆలూర్ మెడికల్ ఆఫీసర్ రఘుబాబు, మండల విద్యాధికారి అక్బర్ తెలిపారు. సోమవారం చేవెళ్లలోని మండల పరిషత్ కార్యాలయంలో జేఈ వాక్సినేషన్ ప్రోగ్రామ్ గురించి మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదడు వాపు నుంచి పిల్లలను రక్షించడానికి రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఒక పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించబోతున్నదన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ జూలై 25 నుంచి ఆగస్టు 15లోపు దశలవారీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఈ వ్యాక్సిన్‌ను రెండుసార్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్ గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు నోడల్ ఉపాధ్యాయుడుగా ఉంటూ పరిశుభ్రత గురించి విద్యార్థులందరికీ పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

యాచారం పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

యాచారం, జూలై 15 : డీఎస్సీ, గ్రూప్-2 అభ్యర్థుల ఉద్యమ నేపథ్యంలో నిరుద్యోగుల సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో భారత రాష్ట్ర సమితి నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న బీఆర్ఎస్ నాయకుల ఇంటివద్దకు వెళ్లి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖాజామొయినుద్దీన్, నాయకులు తలారి సంపత్, వెంకటేశ్ తదితరులను హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఖాజామొయినుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గుంపు మేస్త్రీ నిర్బంధ పాలన కొనసాగుతున్నదన్నారు. డీఎస్సీ, గ్రూప్-2 అభ్యర్థుల ఉద్యమ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. నిరుద్యోగులతో పెట్టుకుంటే కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులపై ఉన్న ముందు చూపు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో చూపాలన్నారు. నిరుద్యోగులకు అండగా బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అధికార పార్టీ అంతు చూసేందుకు నిరుద్యోగులు తీవ్రస్థాయిలో ఉద్యమించనున్నట్లు తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి
- బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 15 : నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన గుంపుమేస్త్రీ ప్రస్తుతం మాటమార్చడం సరైన పద్ధతి కాదని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి నేటికీ నోటిఫికేషన్ వేయకుండా నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయటం సిగ్గుచేటన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పర్యటించిన రేవంత్ పర్యటనను అడ్డుకుంటామనే సాకుతో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలీసుస్టేషన్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లకు పత్రాలు పంచుతూ సంకలు గుద్దుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు.

వేగంగా ఆలయ పనులు

పెద్దఅంబర్‌పేట, జూలై 15 : పెద్దఅంబర్‌పేట ఐదో వార్డులో బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. వచ్చే నెల 9 నుంచి 11 వరకు బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు నాయకుడు బొర్ర సురేశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన వివరాల పత్రికను రామకృష్ణ పంతులుతో రాయించారు. గ్రామస్తులందరి సహకారంతో కార్యక్రమాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు

ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, అంగన్‌వాడీలు

షాద్‌నగర్‌టౌన్, జూలై 15 : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల వేతనాన్ని రూ.18వేలకు పెంచడంతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పడం జరిగిందన్నారు. జీవో ఎంఎస్ నం.10ని రద్దు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌గా అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష ఇస్తూ జీవోను జారీ చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా వ్యతిరేక విధానాలను మాత్రం వేగవంతంగా అమలు చేస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శ్రీనూనాయక్, సీఐటీయూ కేశంపేట మండల కన్వీనర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ప్రాజెక్టు నాయకులు జయమ్మ, ఊర్మిళ, సంగీత, సుజాత, మమత, హేమలత, వీణ, అనసూయ, శోభారాణి, జ్యోతి, నర్సమ్మ, జయమ్మ, శ్రీదేవి, ఇందిర, ఉమ, రాజ్యలక్ష్మి, తులసి, వినోద, సంతోష, భాగ్యలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే శంకర్ వైద్యాధికారులకు సూచించారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మి, వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతూ వైద్య సేవలను అందించాలన్నారు. దవాఖానలపై ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాలని, 102, 108 వాహనాలను నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యదర్శులతో సమన్వయం చేసుకొని సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఏవైనా మందులు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాఘవేందర్, నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

- ఎంపీడీవో సంధ్య
- మొయినాబాద్ మండలంలో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'


చిలుకూరు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో సంధ్య తదితరులు

మొయినాబాద్, జూలై 15 : ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులకు ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి సంధ్య సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని యోచిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం.. పేదలు, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల కోసమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, డాక్టర్ సాయిబాబా, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మొయినాబాద్‌లో..

మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ అనసూయ పిల్లలతో ప్లకార్డులను ప్రదర్శింపజేస్తూ ర్యాలీ నిర్వహించారు. రెండున్నర ఏండ్లు దాటిన తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రవిత అన్నారు. వారికి అక్షర జ్ఞానం బోధించడంతోపాటు మంచి పోషకాహారం అందించడం జరుగుతుందని ఆమె చెప్పారు.


విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తున్న రంగారెడ్డి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి
- షాద్‌నగర్‌రూరల్, జూలై 15

వనమహోత్సవంలో భాగంగా మంచాలలో సోమవారం ఇంటింటికీ పండ్లు, పూలమొక్కలను గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్
- మంచాల, జూలై 15

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యం

కడ్తాల్/తలకొండపల్లి, జూలై 15 : నిరుపేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని ట్రస్టు చైర్మన్, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన కర్రె ఎల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు తరపున రూ.5 వేలు అందజేశారు. తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్వకోల్ మహేశ్ మరణించగా.. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మల బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ తరపున రూ.3 వేలు, మాజీ ఎంపీపీ రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు.


సోమవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించిన ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ మాజీ ఎంపీటీసీ నాగటి నాగమణి భర్త భాస్కర్ దిశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేశ్, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తదితరులు
- ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 15

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడ ప్రభుత్వ పాఠశాలలో సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికిన సహచరులు
- తుర్కయాంజాల్, జూలై 15

నందిగామ మండలంలోని చేగూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్పోర్ట్స్ డ్రెస్సులు, టై, బెల్ట్‌లను పంపిణీ చేస్తున్న గ్రామానికి చెందిన బంటారం మల్లేశ్‌గౌడ్
- నందిగామ, జూలై 15

ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహించి సాధారణ బదిలీలో భాగంగా వేరే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న కానిస్టేబుళ్లు రఘునాయక్, శ్రీశైలంలకు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో సన్మానం
- ఆమనగల్లు, జూలై 15

మెహిదీపట్నం డీఎంకు వినతిపత్రం అందిస్తున్న శ్రీరాంనగర్ గ్రామస్తులు

ఆర్టీసీ బస్ సర్వీసులను పునరుద్ధరించాలి

మొయినాబాద్, జూలై 15 : ఆర్టీసీ బస్ సర్వీసులను పునరుద్ధరించాలని శ్రీరాంనగర్ గ్రామస్తులు సోమవారం మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందించారు. బస్సులు లేక విద్యార్థులతో పాటు మెహిదీపట్నం రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే రైతులు, నగరంలో ప్రైవేట్ ఉద్యోగాలు చేయడానికి వెళ్తున్నవారు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులు వచ్చేవని.. ప్రస్తుతం అవి కూడా రావడంలేదని తెలిపారు. ఇంత చెప్పినా డీఎంలో ఎలాంటి స్పందన లేదని కాంగ్రెస్ నాయకుడు జంగారెడ్డి తెలిపారు. రోడ్డును బాగు చేసుకొని వస్తేనే మీ గ్రామాలకు బస్ సర్వీస్‌లను పునరుద్ధరిస్తానని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని ఆయన పేర్కొన్నారు. డీఎం తీరుపై రోడ్డు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.



ఇబ్రహీంపట్నం సమీపంలోని స్ఫూర్తిజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంధ విద్యార్థుల ఆశ్రమానికి చెందిన వంశీకృష్ణ అనే విద్యార్థి బేగంపేట్‌లోని విద్యా ఇన్‌ఫోటెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు జ్యోతి మాట్లాడుతూ.. అంధుల ఆశ్రమంలో విద్యనభ్యసించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు.
- ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 15

తైబజార్ వేలం పాట రూ.15.5 లక్షలు

తైబజార్ వేలం పాటలో పాల్గొన్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల రూరల్, జూలై 15 : శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాటను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో పలువురు వేలం పాడగా.. అత్యధికంగా రూ.15 లక్షల 50 వేలకు టెండర్‌ను శోభ పెంటరాజ్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విజయలక్ష్మి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చెర్మన్ వెంకటరాంరెడ్డి, మున్సిపల్ మేనేజర్ పాల్గొన్నారు.

కొత్తూరు నూతన ఎస్ఐగా బలరాంనాయక్

కొత్తూరు, జూలై 15 : కొత్తూరు నూతన ఎస్ఐగా బలరాం నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బలరాంనాయక్ ఆమనగల్లు పీఎస్‌లో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై కొత్తూరు పీఎస్‌కు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాస్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

చేవెళ్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

చేవెళ్ల రూరల్/చేవెళ్ల టౌన్, జూలై 15 : చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామ పరిధిలోని సర్వే నం.185లో నిర్వహిస్తున్న ఎస్ఆర్ మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల ఆర్డీవో సాయిరాంకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్, మల్లేశ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 ఎకరాల విస్తీర్ణం కలిగిన గుట్టను ఇప్పటికే నేలమట్టం చేశారని, భూగర్భ జలాలు, పర్యావరణం దెబ్బతినే ప్రమాదముందని, మైనింగ్ అనుమతులు పూర్తిగా రద్దుచేయాలని వారు కోరారు. లేకపోతే అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకుడు శ్రీకాంత్, పీడీఎస్‌యూఎస్‌యూ నాయకుడు రాజేశ్ ఉన్నారు.

కొత్తూరు మున్సిపాలిటీలో రవి ఫుడ్స్‌వారు అక్రమంగా నిర్మిస్తున్న భవనం

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో రవి ఫుడ్స్‌వారు అక్రమంగా నిర్మిస్తున్న భవనానికి మున్సిపల్ సిబ్బంది నోటీసులు అందజేశారు.
- కొత్తూరు, జూలై 15